కష్టాల ఖరీఫ్

- సాగు విస్తీర్ణం తగ్గిపోయింది
- దిగుబడిపైనా తీవ్ర ప్రభావం
- కనిపించని ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- దళారులు చెప్పిందే రేటు
- రోడ్లపైనే ధాన్యం రాశులు



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు నాగయ్య. కోవూరు నియోజకవర్గం బుచ్చిరెడ్డిపాళెం మండలం చెల్లాయపాళెం వాసి. ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో తన పంటలను ఇలా నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై ఆరబోసి కాపలాగా ఉన్నాడు. గత రబీలో ఎకరాకు 3.5 పుట్ల దిగుబడి వస్తే ఖరీఫ్‌లో మూడు పుట్లు కూడా రాలేదని, ధర కూడా తగ్గిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. సాగునీటి కొరత, అధిక ఉష్ణోగ్రతల కారణంగా దిగుబడి తగ్గిందని చెప్పాడు.

సంగం: అన్నదాతలను ఖరీఫ్ పంట కష్టాల సుడిగుండంలో నెట్టింది. సాగునీటి కొరతతో జిల్లా వ్యాప్తంగా సాగు విస్తీర్ణం తగ్గితే.. ఎండలు మండి దిగుబడి సైతం పడిపోతోంది. వచ్చిన కాడికి అమ్మి సొమ్ము చేసుకోవాలనే అన్నదాతల ఆలోచనలకు ప్రభుత్వ నిర్లక్ష్యం అడ్డుకట్ట వేస్తోంది. జిల్లాలో వరికోతలు మొదలై వారం రోజులవుతున్నా కొనుగోలు చేసే విషయాన్ని పట్టించుకోకపోవడంతో దళారులు చెలరేగిపోతున్నారు. చాలామంది అన్నదాతలు నెల్లూరు – ముంబై జాతీయ రహదారిని తమ నిల్వ చేసే కేంద్రాలుగా మార్చుకుని గిట్టుబాటు ధర కోసం సుడులు తిరిగే కన్నీటి నడుమ ఎదురు చూస్తున్నారు.

ఈసారిలా..

సాధారణంగా జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో మూడు లక్షల ఎకరాలకు పైగా వరిసాగు చేసేవారు. ఈసారి అనేక అడ్డంకులు ఏర్పడ్డాయి. సాగునీటి కొరత వేధించింది. జిల్లా వ్యాప్తంగా కాలువల మీద ఆధారపడిన అన్నదాతలు వరిసాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టారు. వ్యవసాయ పంపుసెట్లున్న వారు సుమారు 40 వేల ఎకరాల్లో సాగు చేశారు. జిల్లా మొత్తంగా కేఎన్ఎం 1638, కేఎన్ఎం 733, ఎంపీయూ 1010 రకాలను వేశారు. వాతావరణం అనుకూలించకపోవడం, వివిధ కారణాలతో ఈసారి దిగుబడిపై బాగా ప్రభావం పడింది. గత రబీ సీజన్‌లో దిగుబడి ఎకరాకు 3.5 పుట్లు ఉంటే ప్రస్తుతం మూడు పుట్లు కూడా లేకపోవడంతో రైతుల బాధ వర్ణనాతీతంగా ఉంది.

కొనుగోలు కేంద్రాల్లేక..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. అన్నదాతల కష్టాన్ని మిల్లర్లు, దళారులు దోచుకోకుండా చర్యలు తీసుకుంది. కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. వరికోతలు ప్రారంభమై రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు పెట్టలేదు. కోతలకు ముందే ప్రణాళిక వేసుకోవాల్సినా ఆ దిశగా ఆలోచన చేయలేదని విమర్శలున్నాయి.

అంతా వారిష్టం

కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారులు రంగ ప్రవేశం చేశారు. తాము చెప్పిన ధరకే అమ్మాలని, లేకుంటే నష్టపోతారని బెదిరిస్తున్నారు. దళారులందరూ కుమ్మక్కై ఒకే ధరకు రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారు. రబీ సీజన్‌లో పుట్టికి రూ.22,500కు కొనుగోలు చేయగా.. ఖరీఫ్‌లో మాత్రం పుట్టికి సుమారు రూ.4 వేలు తగ్గించి ప్రస్తుతం రూ.18,500కు కొనుగోలు చేస్తున్నారు. దళారులు ధరలు తగ్గించడంతో అన్నదాతలు తామ పంటను రోడ్లపైనే నిల్వ చేస్తున్న పరిస్థితులున్నాయి.

కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం

ఖరీఫ్ పంట ధాన్యం సేకరణకు కొనుగోలు కేంద్రాలను త్వరలో ప్రారంభిస్తాం. ఇప్పటికే అధికారులకు తెలియజేశాం. అన్నదాతలు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు. ధర తగ్గించి ధాన్యం కొనుగోలు చేసే వారిపై చర్యలు తీసుకుంటాం.

– సత్యవాణి, డీపీఓ, నెల్లూరు



కాగులపాడులో కోతకు సిద్ధంగా ఉన్న వరి పైరు

రేపటి నుంచి గ్రామసభలు

దుత్తలూరు: ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీల్లో భాగంగా మండలంలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఏపీఓ బ్రహ్మయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2న రెడ్డదిన్నె, 3న రాచవారిపల్లి, 4న భైరవరం, ఏరుకొల్లు, సోమల రేగడ, వెంగన్నపాళెం, నరవ్రాడ, 6న దుత్తలూరు, 7న బండకిందపల్లి, పాపంపల్లి, తెడ్డుపాడు, వెంకటంపేట, కొత్తపేట, బ్రహ్మేశ్వరం, నందిపాడు, 8న బోడవారిపల్లి, తిమ్మాపురం పంచాయతీల్లో సభలు జరుగుతాయని వెల్లడించారు.

కోదండరామ ఆలయంలో అభిషేకాలు

కలిగిరి: మండలంలోని చంద్రారెడ్డిపాళెం గ్రామంలో ఇటీవల నిర్మించిన కోదండరామ స్వామి ఆలయంలో శనివారం వేదపండితులు నారాయణ శ్రీనివాస దీక్షితుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. భక్తులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

ఆర్డీఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

- ఆర్డీఓ మధులత



ఆత్మకూరు: ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ కె.మధులత తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అత్యవసరమైతే 91009 48215 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. నదీ తీర ప్రాంత గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని సూచించారు.

నాలుగు కుటుంబాలకు ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న పరమేశ్వరరెడ్డి తదితరులు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో నాలుగు కుటుంబాల వారికి శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం చేశారు. 2వ వార్డుకు చెందిన జలదంకి అనూరాధ, 22వ వార్డుకు చెందిన రాగి హజరత్తయ్య, అదే వార్డుకు చెందిన మాదాల సుభాషిణి, 23వ వార్డుకు చెందిన ఆదిపూడి పోలయ్య ఇటీవల మృతిచెందారు. బాధిత కుటుంబాలకు పరమేశ్వరరెడ్డి శనివారం నగదు అందజేశారు. కార్యక్రమంలో కుడుముల సుధాకర్‌రెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన



మాట్లాడుతున్న డీటీ నాగలక్ష్మి

అల్లూరు: మండల పరిధిలోని బోడిసత్రం గ్రామంలో శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. డీటీ నాగలక్ష్మి మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజేశ్వరి, ఏపీఎం ప్రసాద్‌రావు, వీఆర్వో రహంతుల్లా పాల్గొన్నారు.

పంట కాలువల ఆక్రమణపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యుడు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు పాతూరు చెరువుకు సంబంధించిన పంట కాలువలను కొంతమంది ఆక్రమించి ఇళ్లు నిర్మించారని, తగిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుడు పల్లాల కొండారెడ్డి కోరారు. ఈ మేరకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయన శనివారం తహసీల్దార్ ఎస్‌కే హమీద్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. కొండారెడ్డి మాట్లాడుతూ పంట కాలువలను ఆక్రమించడంతో వర్షపునీటి పారుదలలో సమస్యలు వస్తున్నాయన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పరిశీలించి ఆక్రమణలు తొలగించాలన్నారు. స్పందించిన తహసీల్దార్ సర్వే చేయిస్తామన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు కృషి

వింజమూరు(ఉదయగిరి): ఉదయగిరి నియోజకవర్గంలోని నిరుద్యోగుల కోసం పరిశ్రమల ఏర్పాటుకు ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. మండలంలోని ఊటుకూరులో శనివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉదయగిరి మెట్ట ప్రాంతానికి సాగునీటి పారుదలకు సమయం పడుతోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రఘు, డి.వెంకటేశ్వరరావు, జూపల్లి రాజా, చల్లా వెంకటేశ్వర్లు, మద్దినేని నరేంద్ర, ఎం.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చండీ యాగం



యాగం నిర్వహిస్తున్న దృశ్యం

సంగం: మండలం వంగల్లు గ్రామంలోని భీమేశ్వరస్వామి ఆలయంలో కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం చండీ యాగాన్ని నిర్వహించారు. ముందుగా స్వామికి ప్రత్యేకంగా అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పగడాల రఘురామయ్య, రాజరాజేశ్వరీదేవి జ్ఞాన పీఠం పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం

- జిల్లా ఉద్యాన అధికారి సుబ్బారెడ్డి



మొక్క నాటి నీరు పోస్తున్న దృశ్యం

వింజమూరు(ఉదయగిరి): ఆయిల్‌పామ్ సాగు ద్వారా లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యాన అధికారి ఎంవీ సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని ఊటుకూరులో శనివారం ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 66 హెక్టార్ల విస్తీర్ణంలో మొక్కలు నాటినట్లు తెలిపారు. రైతులకు ప్రభుత్వం హెక్టార్‌కు రూ.29 వేలు రాయితీ ఇవ్వడంతోపాటు అంతర పంటల సాగుకు, ఎరువుల కోసం నాలుగేళ్లకు రూ.42 వేలు రాయితీ ఇస్తుందన్నారు. సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఊటుకూరు గ్రామానికి చెందిన మాదినేని కాంతమ్మ, సర్వసతి పొలంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ బి.శ్రీనివాసులు, జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, సర్పంచ్‌లు వెంగమ్మ, ఎంపీటీసీ మల్లికార్జున, ఏడీఏ ఎన్.రామిరెడ్డి, ఉద్యాన అధికారి సాహూల్, నేతలు జూపల్లి రాజారావు, గొంగటి రఘు, చల్లా వెంకటేశ్వర్లు, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనన ధ్రువీకరణ పత్రాల అందజేత



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఆర్డీఓ

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరులో ఆధార్‌కార్డుల్లేని గిరిజన కుటుంబాలకు జనన ధ్రువీకరణపత్రాలను ఆర్డీఓ కె.మధులత శనివారం అందజేశారు. ఆమె మాట్లాడుతూ రామస్వామిపల్లి, మహిమలూరు, దేపూరు, వాశిలి, అశ్వనీపురం, వెన్నవాడ, గండ్లవేడు తదితర గ్రామాల్లోని గిరిజనులు అధికంగా ఆధార్‌కార్డులు తీసుకోలేదని సర్వే ద్వారా తెలిసిందన్నారు. వీరు కొత్తగా ఆధార్ నమోదు చేసుకోవడానికి జనన ధ్రువీకరణపత్రాలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు తహసీల్దార్ సుధీర్, ఆర్ఐ పృథ్వీకుమార్, మహిమలూరు సర్పంచ్ పెట్లడ చంద్రశేఖర్, వీఆర్వో సూరిపోగు కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శి పల్లవోలు భాస్కర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



డీఎస్పీని సన్మానిస్తున్న నేతలు

ఆత్మకూరు: ఇటీవల బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ కె.వేణుగోపాల్, తహసీల్దార్ సుధీర్‌ను శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, కౌన్సిలర్ పొడమేకల పెంచలయ్య, నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, సయ్యద్ జమీర్, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, బాల అంకయ్య, కొండా వెంకటేశ్వర్లు, ప్రతాప్, సురేంద్ర, హరి కిశోర్, ఖాజావలీ, జమ్ము, దిలీప్, చైతన్య పాల్గొన్నారు.

గంధ మహోత్సవానికి పటిష్ట బందోబస్తు



వివరాలు తెలుసుకుంటున్న సీఐ వేమారెడ్డి

అనుమసముద్రంపేట: దొరసానమ్మ గంధ మహోత్సవానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు సంగం సీఐ వేమారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాను శనివారం ఆయన సందర్శించారు. ఇక్కడ వసతుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏఎస్‌పేట ఎస్సై సైదులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కృష్ణాష్టమి వేడుకలు



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

దుత్తలూరు: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక దుత్తలూరు శాఖ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు శనివారం జరిగాయి. ముందుగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించి పల్లకిలో ఉంచి దుత్తలూరు సెంటర్, గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

హమ్మయ్య.. వర్షం కురిసింది



జలదంకిలో కురుస్తున్న వర్షం

జలదంకి: సుమారు నెలరోజులకు పైగా వర్షం లేక అల్లాడుతున్న ప్రజలకు ఎట్టకేలకు ఉపశమనం లభించింది. శనివారం తెల్లవారుజాము నుంచి మండలంలో వాన మొదలైంది. సాయంత్రం వరకు చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. మరో రెండురోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించడంతో సాగునీటి కష్టాలు తీరుతాయని రైతులు చెబుతున్నారు.

- **చేజర్ల:** మండలంలో శుక్రవారం రాత్రి నుంచి మోస్తరు వర్షం కురిసింది. కొన్నిరోజులుగా ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు ఈ వానతో ఊపిరి పీల్చుకొన్నారు.

వైద్య శిబిరాలు

చేజర్ల: మండలంలోని పాతపాడు సచివాలయం, ఓబులాయపల్లి అంగన్‌వాడీ కేంద్రం వద్ద శనివారం వైద్య శిబిరాలు నిర్వహించారు. సుమారు 60 మందికి బీపీ, షుగర్, ఇతర పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ చంద్రయ్య, ఎంఎల్‌హెచ్‌పీ రేవతి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ



మర్రిపాడు: ఆత్మకూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి గోపాల్ మండలంలోని చుంచులూరు, కదిరినాయుడుపల్లి, కదిరినాయుడుపల్లి, టీఎన్‌పేట, బ్రాహ్మణపల్లి, కంపసముద్రం ఉన్నత పాఠశాలలను శనివారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి టీచర్లతో మాట్లాడారు. ఆయన దృష్టికి వచ్చిన సమస్యలకు పరిష్కార మార్గాలు చూపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి-2 ధనలక్ష్మి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

జంగారెడ్డిపల్లెలో ముగిసిన ఎస్ఎంసీ ఎన్నికలు

వరికుంటపాడు: మండలంలోని జంగారెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాల ఎస్ఎంసీ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఇప్పటికి రెండుసార్లు వాయిదా పడగా శనివారం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్‌పర్సన్‌గా గవ్వల వెంకటలక్ష్మమ్మ, వైస్ చైర్మన్‌గా మందా నరేష్ వ్యవహరిస్తారు. ఎన్నికల పరిశీలకుడిగా కాంతారావు, పర్యవేక్షకుడిగా ఎంఈఓ షావుద్దీన్ వ్యవహరించారు.

అనారోగ్యంతో వీఆర్వో మృతి



నరసింహారెడ్డి (ఫైల్)

ఆత్మకూరురూరల్: నెల్లూరుపాళెం వీఆర్వో చల్లా నరసింహారెడ్డి అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. ఈయన స్వస్థలం నువ్వూరుపాడు. ఆత్మకూరు తహసీల్దార్ సుధీర్ వీఆర్వో దహన సంస్కారాలకు ప్రభుత్వం తరఫున రూ.25 వేలను బాధిత కుటుంబానికి అందజేశారు. డీటీ రాజేష్, ఆర్ఐ పృథ్వీకుమార్, మండలంలోని వీఆర్వోలు, వీఆర్ఏలు సంతాపం తెలిపారు.

ఉపాధి కూలీల సంఖ్యను పెంచండి

ఉదయగిరి: ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ ఈశ్వరమ్మ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో శనివారం సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పక్కాఇళ్లకు సంబంధించి ఉపాధి పనులు చేయించాలన్నారు. పండ్ల తోటల పెంపకం గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మండలంలో 200 ఎకరాలు లక్ష్యంగా ఇవ్వగా ఇప్పటికి 75 ఎకరాలకు మాత్రమే దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈనెల 10వ తేదీ లోపు లక్ష్యం పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

టౌన్‌హాల్లో సమావేశం నేడు

ఆత్మకూరు: ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ సమావేశం ఆదివారం నెల్లూరు టౌన్ హాల్లో జరుగుతుందని కమిటీ సభ్యులు ఎల్లంకి వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి నిర్వహించే సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.మాల్యాద్రి, జె.బాబు పాల్గొంటారన్నారు.

వినాయకుని విగ్రహ ఏర్పాటుకు పూజలు



పూజలో పాల్గొన్న కమిటీ సభ్యులు

ఆత్మకూరు: వినాయక చవితి సందర్భంగా పట్టణంలోని జేఆర్‌పేటలో విగ్రహ ఏర్పాటుకు శనివారం కమిటీ ఆధ్వర్యంలో పందిరి గుంజను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. దశాబ్ద కాలంగా ఇక్కడ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కె.ఓబుల్‌రెడ్డి, డాక్టర్ సీవీ రెడ్డి, ఎ.సురేంద్రరెడ్డి, పద్మానాయుడు, శ్రీనివాసులు, వెంకటేశ్వరరెడ్డి, కె.రవీంద్రకుమార్, మహిళా కమిటీ సభ్యులు సంపూర్ణమ్మ, సుజాత, రత్న సుధ, విజయమ్మ, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఏపీఎంకు వినతిపత్రం అందజేస్తున్న వీఓఏలు

సోమశిల: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అనంతసాగరం మండల వెలుగు వీఓఏలు సీఐటీయూ ఆధ్వర్యంలో ఏపీఎం వెంకటరమణకు శనివారం స్థానిక కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వీఓఏ యూనియన్ మండల నాయకురాలు లక్ష్మి మాట్లాడుతూ బకాయి ఉన్న వేతనాల కోసం అనేక పర్యాయాలు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తక్షణమే స్పందించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా వీఓఏలను అక్రమంగా తొలగించారన్నారు. మరి కొందరిని తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, దీనిని ఆపాలన్నారు. కార్యక్రమంలో సుజాత, లక్ష్మి సౌజన్య, షాహీద, సౌభాగ్యమ్మ, రమణమ్మ, ఆదిలక్ష్మి, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలకు ఏర్పాట్లు



బీరాపేరు వద్ద సిద్ధం చేస్తున్న బోటు

సంగం: డ్రెడ్జింగ్ విధానంలో తవ్వకాలు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేశారు. సంగం బీరాపేరు సమీపంలో ఉన్న ఇసుక రీచ్‌లో ప్రభుత్వం తవ్వకాలు జరిపేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా బోటును కృష్ణా జిల్లా నుంచి రీచ్‌కు తెప్పించారు. నాలుగు క్రేన్ల సహాయంతో దానిని పెన్నానదిలోకి దించారు. శనివారం ఏర్పాట్లను మైనింగ్ డీడీ శ్రీనివాసులు, ఇరిగేషన్ డీఈ మధు, ఏఈ కృష్ణ, రెవెన్యూ అధికారులు పర్యవేక్షించారు. తవ్విన ఇసుకను సంగం కూడలిలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు వద్దకు తరలిస్తారు. అక్కడ ప్రభుత్వం నిర్ణయించిన ధర టన్నుకు రూ.380 వంతున అమ్మకాలు సాగిస్తారు. ఆదివారం నుంచి సంగం నిల్వ కేంద్రంలో ఇసుక అందుబాటులో ఉంటుందుందని డీడీ తెలిరు. నిబంధనల ప్రకారమే ధర నిర్ణయించామన్నారు.

ఇద్దరి మధ్య ఘర్షణ



గాయపడిన వీరయ్య

సోమశిల: మతిస్థిమితం లేని వ్యక్తి.. మరొకరి మధ్య ఘర్షణ జరిగింది. స్థానికుల కథనం మేరకు.. అనంతసాగరం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ వద్ద శనివారం మతిస్థిమితం లేని వ్యక్తికి మంచాలపల్లికి చెందిన కోమూరు వీరయ్య అనే అతని మధ్య వాగ్వాదం జరిగింది. మాటామాటా పెరిగి కర్రలతో దాడులు చేసుకున్నారు. ఇద్దరికీ రక్త గాయాలయ్యాయి.

పింఛన్ల పంపిణీ



ఆత్మకూరు: పింఛన్ అందజేస్తున్న కమిషనర్

ఆత్మకూరురూరల్: మండలంలోని 11 సచివాలయాల పరిధిలో శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ కరటంపాడులో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. చెర్లోయడవల్లిలో ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి పింఛన్లను అందజేశారు.

- **ఆత్మకూరు:** మున్సిపల్ పరిధిలో శనివారం కమిషనర్ షేక్ ఫజులుల్లా పింఛన్లు అందజేశారు.
- **వరికుంటపాడు:** మండలంలోని 24 పంచాయతీల్లో శనివారం లబ్ధిదారులకు పింఛన్లు అందజేశామని ఎంపీడీఓ ఎన్.మల్లికార్జున తెలిపారు.
- **అల్లూరు:** మండలంలో శనివారం 6,900 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ జ్యోతి తెలియజేశారు.